

## చాక్‌పీస్‌లతో యాదాద్రి ఆలయ ప్రతి రూపం

దాదాపు 8 వేల చాక్ పీస్‌లతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ నమూనాను రూపొందించారు హైదరాబాద్‌లోని కార్వాన్‌కు చెందిన సూరం సంపత్‌కుమార్. కళలపై ఆయనకు ఉన్న అభిరుచితో ఆలయాన్ని మహాద్భుతంగా నిర్మించి గ్లాస్ అక్వేరియంలో అమర్చారు. శుక్రవారం దాన్ని ఈవో ఎన్ గీతకు అందజేశారు. సంపత్‌కుమార్ జేఎన్‌టీయూలో ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేశారు. ఈ ఏడాది మార్చి 22 ఉగాది రోజున ఈ ఆలయ నమూనా తయారీని ప్రారంభించి, దాదాపు 5 నెలలు కష్టపడి పూర్తిచేసినట్టు ఆయన పేర్కొన్నారు.

- యాదగిరిగుట్ట

## మావోయిస్టు శ్రీనుకు బెయిల్

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అమనగల్ కాంగ్రెస్ నేత, ఎంపీపీ పంతు నాయక్ హత్య కేసులో నిందితుడు, మావోయిస్టు నేత దారగోని శ్రీను విక్రమ్‌కు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేలు పూచీకత్తు సమర్పించాలని, నెలలో ప్రతి మొదటి ఆదివారం అమనగల్ పోలీసుస్టేషన్‌లో హాజరు కావాలని ఆదేశించింది. ఎంపీపీ హత్య కేసులో 2015లో కింది కోర్టు విధించిన యావజ్జీవ శిక్షను హైకోర్టులో సవాల్ చేసిన అప్పీల్‌పై విచారణ పూర్తయ్యే వరకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మధ్యంతర పిటిషన్‌ను విక్రమ్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ కే సుజనతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. పిటిషనర్ గత 11 ఏండ్లుగా జైలులో ఉన్నారని, బెయిల్ ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది కోరారు. వాదనలు విన్న ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది.

## డీఈఐఎడ్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలు విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డిప్లొమా (డీఈఐఈడీ) -సెప్టెంబర్ 2023 ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు డీఈఐఎడ్ డైరెక్టర్ వెల్లడించారు. రీకౌంటింగ్‌కు నవంబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.






# వీఆర్‌ఏలకు లైన్ క్లియర్

- ముగిసిన న్యాయ వివాదం
- ప్రభుత్వ అఫిడవిట్‌పై ఓఎస్‌ల విశ్వాసం
- ఫలించిన వంగ రవీందర్‌రెడ్డి చర్చలు
- పిటిషన్ ఉపసంహరించుకున్న ఓఎస్‌లు
- 20 వేల కుటుంబాల్లో ముందే వచ్చిన దసరా



ట్రెసా కార్యాలయంలో అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డికి స్వీట్లు తినిపిస్తున్న వీఆర్‌ఏలు, ఓఎస్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. ప్రభుత్వం జారీచేసిన జీవో 81, 85పై ఆఫీస్ సబార్డినేట్లు(ఓఎస్‌లు) దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం మూసివేయడంతో వీఆర్‌ఏల కుటుంబాల్లో సంతోషాలు నిండాయి. పలువురు వీఆర్‌ఏలు, ఓఎస్‌లు నాంపల్లిలోని ట్రెసా కార్యాలయానికి వెళ్లి అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డికి స్వీట్లు తినిపించి ఆనందం పంచుకున్నారు. నీరటి, మస్కూరు, లష్కర్, షేక్‌సింధ్ వంటి కాలం చెల్లిన పేర్లతో పిలుస్తూ, భూస్వామ్య వ్యవస్థకు చిహ్నలుగా మిగిలిన వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20,555 మంది వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తూ ఈ ఏడాది జూలై 24న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 61 ఏండ్లలోపు వయసున్న 16,758 మందిని ఆగస్టు మొదటివారంలో ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసింది. మిగతావారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. పదో తరగతి వరకు చదివిన వారికి లాస్ట్ గ్రేడ్ సర్వీస్ (ఆఫీస్ సబార్డినేట్), ఇంటర్ చదివిన వారికి రికార్డ్ అసిస్టెంట్, డిగ్రీ, ఆపై చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తింపజేసింది.

### కోర్టు కేసుతో ఆటంకాలు

రెవెన్యూశాఖకు చెందిన 30 మంది ఆఫీస్ సబార్డినేట్‌లు జీవో 81, 85పై హైకోర్టును ఆశ్రయించారు. తమకు పదోన్నతులు కల్పించిన తర్వాతే వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం వీఆర్‌ఏల క్రమబద్ధీకరణపై ఆగస్టు 10న స్టే విధించడంతో వారంతా దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు కావడంతో పాత వేతనాలు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. పే స్కేల్ వర్తించినా కోర్టు ఆదేశాలతో ఎంపాయిమెంట్ ఐడీ రాకపోవడంతో కొత్త వేతనాలు దక్కని పరిస్థితి నెలకొంది.

### ఫలించిన చర్చలు

వీఆర్‌ఏల బాధలు అర్థం చేసుకున్న ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని 30 మంది ఓఎస్‌లతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. మరోవైపు, తమ నిర్ణయంతో వారికి ఎలాంటి నష్టం కలగబోదని ప్రభుత్వం కోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. ఇది ఓఎస్‌లలో విశ్వాసం నింపింది. ఇంకోవైపు, చర్చలు కొలిక్కి రావడంతో పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు ఓఎస్‌లు అంగీకరించారు. ఓఎస్‌లు దాఖలు చేసిన ఉపసంహరణ పిటిషన్‌ను పరిశీలించిన జస్టిస్ మాధవిదేవి బెంచ్ కేసును మూసివేసినట్టు పేర్కొంది. కోర్టు తీర్పుతో వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దసరా పండగ తమకు ముందే వచ్చిందంటూ వీఆర్‌ఏలు సంబరాలు చేసుకున్నారు.

### పండుగ వాతావరణం

వీఆర్‌ఏల క్రమబద్ధీకరణపై హైకోర్టు స్టే విధించడంతో మూడు నెలలుగా వేతనాలు లేక అవస్థలు పడుతున్నారు. దసరా పండుగపూట పస్తులుండే పరిస్థితి నెలకొన్నది. సమస్య పరిష్కారానికి ట్రెసా తరఫున ఓఎస్‌లతో మాట్లాడి పిటిషన్ విత్‌డ్రాకు ఒప్పించాం. పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం కేసును మూసివేయడంతో 20 వేలకుపైగా కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది.

-వంగ రవీందర్‌రెడ్డి, ట్రెసా అధ్యక్షుడు

## ‘రజాకార్’ విడుదల నిలిపివేయాలి

- ఎన్నికల సంఘం, సెన్సార్ బోర్డుకు సీపీఐ ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): రజాకార్ సినిమా విడుదలను నిలిపివేయాలని సీపీఐ జాతీయ నేతలు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘంతోపాటు సెన్సార్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. రజాకార్ సినిమా పేరుతో బీజేపీ నేతలు చరిత్రను వక్రీకరిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి, ఓట్లు పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి రజాకార్ సినిమాకు ఫైనాన్స్ చేశారని చెప్పారు. రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణలో సాయుధ పోరాటం జరిగిందని, కానీ బీజేపీ సాయుధ పోరాటాన్ని విముక్తి పోరాటంగా చూస్తోందని పేర్కొన్నారు. బీజేపీ నేతలు ఇలాంటి ప్రయత్నాల వల్ల చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఆ సినిమా విడుదలైతే మత విద్వేషాలు రెచ్చగొట్టినట్టవుతుందని నారాయణ సూచించారు.

## యూపీఐ పేమెంట్లపై మోసాలను నివారించాలి

- సీఐడీ ఏడీజీ మహేశ్ భాగవత్



హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : డిజిటల్ లావాదేవీలు నానాటికీ పెరుగుతున్నా అదేస్థాయిలో కొందరు మోసాలకు తెగబడుతున్నారని సీఐడీ ఏడీజీ మహేశ్ భాగవత్ తెలిపారు. శుక్రవారం నగరంలో పేటీఎం అధికారుల సహకారంతో ‘ఫిన్‌టెక్ ఎకోసిస్టమ్ అండ్ ఫ్రాడ్ ప్రివెన్షన్’పై సీఐడీ అధికారుల కోసం నిర్వహించిన వర్క్‌షాప్‌లో మహేశ్ భాగవత్ మాట్లాడుతూ.. అమాయకులను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు వినూత్న మార్గాలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ఇన్వెస్టిగేషన్ అధికారులు మోసాలను గుర్తించి, నివారించాలని సూచించారు. ఇందుకు చెల్లింపు గేట్ వేలు, అగ్రిగేటర్ల పనితీరుపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పేటీఎం సౌత్ రీజినల్ డైరెక్టర్ వీవీఆర్ మూర్తి, వైస్ ప్రెసిడెంట్ మోహనాజ్ పర్వీన్, లీగల్ కౌన్సిల్ జమాల్ సైత్, అసోసియేట్ ప్రెసిడెంట్ అజయ్‌కుమార్ స్వామి, సీఐడీ విభాగం ఎస్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌సీఏ అధ్యక్షుడిగా జగన్

- తొలి పోటీలోనే పీఠం కైవసం
- మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితకు జగన్ కృతజ్ఞతలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి, అక్టోబర్ 20: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఎన్నికల్లో అర్శనపల్లి జగన్ మోహన్‌రావు(63) జయకేతనం ఎగురవేశారు. ఉత్కంఠభరిత ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో సమీప అభ్యర్థి అమర్‌నాథ్(62)పై విజయం సాధించారు. నువ్వానేనా అన్నట్లు కొనసాగిన అధ్యక్ష పోరులో ఆఖరికి జగన్‌నే విజయం వరించింది. శుక్రవారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా హెచ్‌సీఏ పాలకవర్గానికి ఎన్నికలు జరిగాయి. జాతీయ మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వీఎస్ సంపత్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 173 ఓట్లకు గాను 169 ఓట్లు పోల్ అయ్యాయి.

# పీఎస్ మూర్తికి నమస్తే కారు

- బొనాంజా బంపర్ డ్రాలో గెలుపొందిన నీల్ గోగ్టే ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్
- లక్కీడ్రా తీసిన మంత్రి సత్యవతి రాథోడ్
- పేరు వెల్లడించిన దర్శకుడు అనిల్ రావిపూడి
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే మా ఇంటి పత్రికలు: మంత్రి సత్యవతి రాథోడ్
- ‘నమస్తే’ ఏండ్లపాటు యాది ఉంటది: అనిల్
- పాఠకులతో అనుబంధం ధృడపరుచుకునేందుకే దసరా బొనాంజా స్కీం: ఎడిటర్ కృష్ణమూర్తి

హైదరాబాద్ సిటీబ్యూరో/ఖైరతాబాద్/అమీర్‌పేట్, అక్టోబర్ 20 ( నమస్తే తెలంగాణ ): నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సంయుక్తంగా నిర్వహించిన దసరా షాపింగ్ బొనాంజా బంపర్ డ్రాలో లాల్‌దర్వాజకు చెందిన నీల్ గోగ్టే ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ పీఎస్ మూర్తి విజేతగా నిలిచారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దసరా షాపింగ్ బొనాంజా కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడితో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సత్యవతి రాథోడ్ లక్కీ డ్రా తీశారు. ఇందులో పీఎస్ మూర్తిని నిస్సాన్ మాగ్నెట్ కారు వరించింది. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పాఠకులతో అనుబంధాన్ని మరింత ధృడపరుచుకోవాలనే నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆశయం ఎంతో గొప్పదని అన్నారు. తెలంగాణ గొంతుకగా నిలిచిన ఈ రెండు దినపత్రికలను ప్రతి ఒక్కరూ ఇంటి పత్రికలుగా భావిస్తారని చెప్పారు. బతుకమ్మ, నవరాత్రులతో ఇప్పటికే పండుగ వాతావరణం ఉంటే దానికి తోడు దసరా షాపింగ్ బొనాంజాతో నమస్తే తెలంగాణ మరింత ఉత్సాహభరితమైన వాతావరణాన్ని తీసుకొచ్చిందని ప్రశంసించారు. షాపింగ్ చేసిన వారికి డిస్కౌంట్‌లు రావడం ఓకే కానీ.. కారు కూడా గిఫ్ట్‌గా ప్రదానం చేయాలని అనుకోవడం గొప్ప విషయమని చెప్పారు. కారు కొనుగోలు చేయడమే లక్ష్యంగా చాలా మంది ఉంటారని, ఇలాంటి కార్యక్రమాలతో వారి కల నెరవేరడం మంచి అనుభూతినిస్తుందని చెప్పారు.

### చాలామందిలో సంతోషాన్ని నింపారు: అనిల్

పాఠకులతో అనుబంధాన్ని పెంచుకోవడంలో భాగంగా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికలు దసరా బొనాంజా కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం గొప్ప విషయమని దర్శకుడు అనిల్ రావిపూడి పేర్కొన్నారు. చాలా మందికి విలువైన గిఫ్ట్‌లతో పాటు కారును బహుమతిగా ఇచ్చి వారిలో సంతోషానికి కారణమవుతున్న పత్రికల కృషి అభినందనీయమని అన్నారు. ‘నేను ఒక్కటే చెప్పగలను.. నమస్తే తెలంగాణ చాలా ఏండ్లు యాదుంటుంది’ అని పేర్కొన్నారు. తెలంగాణ సెక్రటేరియట్ చాలా గొప్పగా ఉందని కొనియాడారు. తాను నిర్మించిన భగవంత్ కేసరిలో చాలా సీన్లు సెక్రటేరియట్, ట్యాంక్‌బండ్ వద్ద షూట్ చేశామని తెలిపారు. ఆ సమయంలో అక్కడ జరిగిన అభివృద్ధి చూసి చాలా సంతోషానికి గురయ్యామని గుర్తుచేశారు. లక్కీ డ్రాలో గెలుపొందిన పీఎస్ మూర్తికి ఫోన్ చేసి, అభినందనలు తెలిపారు. ‘మీకు కారు గిఫ్ట్ వచ్చింది.. అభినందనలు.. ఈ సంతోష సందర్భంలో మీరు మా భగవంత్ కేసరి సినిమా చూడాలి’ అంటూ నవ్వులు పూయించారు. అక్కడున్న సభికులంతా చప్పట్లతో సందడి చేశారు.

### సంతోషాన్ని మాటల్లో చెప్పలేను

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దసరా షాపింగ్ బొనాంజాలో కారు గెల్చుకోవడం ఆనందంగా ఉన్నది. గురువారం చర్మాస్‌లో షాపింగ్ చేశాను. వివరాలను నింపి కూపన్ లక్కీ బాక్సులో వేశాను. విజేతగా నా పేరు వస్తుందని ఊహించలేదు. చాలా హ్యాపీగా ఫీలవుతున్నా. సత్యవతి రాథోడ్, అనిల్ రావిపూడి నాతో మాట్లాడి అభినందనలు చెప్పడం మంచి అనుభూతినిచ్చింది. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే పత్రికలకు చాలా థ్యాంక్స్.

-పీఎస్ మూర్తి, బంపర్ బహుమతి విజేత

### సమాజానికి తిరిగి ఇవ్వాలనే సంకల్పం: తిగుళ్ల కృష్ణమూర్తి

‘బతుకమ్మ అంటే తెలంగాణకు ఒక పెద్ద వేడుక. పది రోజులపాటు బంధువులు, స్నేహితులు, ఆత్మీయులు అంటూ ఓ కొత్త లోకంలో ఉంటాం. ఈ వేడుకను మరింత రంగులమయంగా చేయడంలో భాగంగా ఈ బొనాంజా స్కీంను తీసుకొచ్చాం. సమాజానికి తిరిగి ఇవ్వాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమం తీసుకున్నాం’ అని నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రతిసారి మా పేపర్ చందాదారులుగా చేరండి..మా పేపర్ బాగుందా? లేదా? అని మాత్రమే అడుగుతుంటామనీ.. కానీ పాఠకులతో మా అనుబంధం మరింతగా ధృడపడేలా ఈ కార్యక్రమం తీసుకున్నామని చెప్పారు. తాను ఒత్తిడిగా ఉన్న సమయంలో అనిల్ తీసిన ఎఫ్2 సినిమా చూస్తానని చెప్పారు. ‘అనిల్ మరో సినిమా రాజా ది గ్రేట్.. అయితే నేను అనిల్ ది గ్రేట్’ అని అంటానని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టుడే ఎడిటర్ కే శ్రీనివాస్‌రెడ్డి, ఏడీవీటీ జీఎం సురేందర్‌రావు, సీజీఎం(ఆపరేషన్స్) శ్రీనివాస్, సర్క్యులేషన్ జీఎం రాంరెడ్డి, కేఫ్ నిలోఫర్ అధినేత బాబురావు, ఏజీఎంలు రాములు, రాజిరెడ్డి, డీజీఎంలు ప్రవీణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ ప్రతిపాదనకు ఏపీ సర్కారు తిరస్కరణ

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రతిపాదనను ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. తిరుపతి నగరాభివృద్ధికి టీటీడీ బడ్జెట్‌లో ఒక శాతం నిధులు కేటాయించాలన్న టీటీడీ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్టు టీటీడీ ఈవోకు దేవాదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలెవన్ మెమో ఇచ్చారు. ఇటీవల జరిగిన టీటీడీ ధర్మకర్తల మడలి సమావేశంలో టీటీడీ వార్షిక బడ్జెట్‌లో ఒక శాతం కేటాయించి ఓ ప్రత్యేక నిధి ఏర్పాటుకు ప్రతిపాదించారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా వివిధ ధార్మిక సంస్థల నుంచి వ్యతిరేకత రావడంతో ఈ ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ ఈవోను ఆదేశించింది.


